T11108601

# ప్రబోధ 29

ఆత్మతత్త్వమెరుగ ఆనందమబ్బును
తత్త్వమెరుగకున్న తాపమబ్బు
బ్రహ్మ నెరిగినంత బ్రహ్మయే తానగు
ఉన్నమాట తెలుపుచున్నమాట

మృత్పిండమేకం బహు భాండరూపం
సువర్ణమేకం బహు భూషణాని
గోక్షీరమేకం బహు ధేనురూపం
ఏకం పరమాత్మా బహుదేహవర్తి.

మట్టి ఒక్కటేగాని కుండల రూపములు భిన్నములు. సువర్ణము ఒక్కటే కాని ఆభరణములు వివిధమైన రూపములు ధరిస్తుంది. గోవుల రంగులు భిన్నములు గాని గోక్షీరము తెలుపు రంగు. ఆత్మ ఒక్కటే అయితే మానవత్వమందు భిన్నత్వమైన రూపము నందు ఏకత్వముగా ప్రకటిస్తూ వుంటుంది. ప్రతి భూతమునందును అంతర్యామిగా ప్రకటించే దేవుడు ఒక్కడే. అతడే సత్యస్వరూపుడు. అతడే అనంతప్రభువు.

కానీ సత్యము ఒక్కటైనప్పటికిని అనుభవజ్ఞులు దానిని అనేకముగా అనుభవిస్తూ వచ్చారు. ఏకంసత్ విప్రా బహుధా వదంతి. ఉన్న సత్యము ఒక్కటైనప్పటికి వారి వారి అనుభూతులను, వారివారి అనుభవములను పురస్కరించుకొని భగవంతునికి అనేక రూపనామములు కల్పించుతూ వచ్చారు. మూలాధారమును ఎవ్వరును మార్చలేరు. లేక కూర్చలేరు. ఈనాడు భగవంతుని యొక్క తత్త్వాన్ని అర్థము చేసుకొనలేనివారు అనేకులు. అర్థము చేసుకున్నట్లుగా అభినయము చేసేవారు మరింత అధికులు. కానీ దైవత్వమును ఎవ్వరు కూడను ఏనాటికిని పరిపూర్ణముగా అర్థము చేసుకొనలేరు. యతో వాచా నివర్తంతే అప్రాప్య మనసా సహ. మనస్సునకుగానీ, వాక్కునకుగానీ అతీతమైన దివ్యత్వాన్ని పవిత్రతను ఏరీతిగా వారు వర్ణించగలరు. ఏరీతిగా వారు చిత్రించగలరు. మానవునకు అవసరమైన వస్తువులన్నింటిని భగవంతుడు ఉచితముగా సృష్టిస్తూ వచ్చాడు. మట్టి, నిప్పు, గాలి, నీరం, సూర్యకాంతి. కాని భగవంతుడు అనుగ్రహించి ప్రసాదించిన యీ పదార్థములనుండి శాస్త్రవైజ్ఞానికుడు అనేక విధమైన రూపనామములు సృష్టిస్తూ వచ్చాడు. కానీ యీనాడు యీ వైజ్ఞానికుడు యీ పదార్థములను సృష్టిస్తున్నట్లుగా భ్రమిస్తున్నాడు. ఏ పదార్థమును యే శక్తి కూడా

711108602

సృష్టించలేడు. ఉన్నదానికే కన్ను రూపములను ఏర్పరచి భిన్న భిన్నమైన మార్గములను ప్రబోధిస్తూ వస్తున్నాడు.

నీరులో నిప్పు వున్నది. కానీ వైజ్ఞానికుడు తన విజ్ఞాన శక్తిచేత దాని నుండి విద్యుత్ శక్తిని కూడను ప్రసరింప జేయుచున్నాడు. కానీయీ విద్యుత్ శక్తి యీ వైజ్ఞానికుడు సృష్టించినదికాదు. ఇది అగోచరమై గుప్తముగా వుండిన శక్తిని తాను వ్యక్తము చేసుకుంటూ వచ్చాడు. ఈ నీరునందే యీ విద్యుత్ శక్తి లేకుండిన తాను యే మాత్రము కూడను దీనిని సృష్టించలేడు. ప్రతి పదార్థము నందును గుప్తముగా గోప్యముగా వుండిన తత్త్వమును వ్యక్తీకరింప జేసే వ్యక్తులు యీనాడు అధికమైపోతూ వచ్చారు. దీనిని ఆధారముగా గొని వైజ్ఞానిక శాస్త్రము విరివిగా పెరుగుతున్నదని మనము విశ్వసిస్తున్నాము. కానీయీ యొక్క ఉత్పత్తి మానవుడు ప్రత్యేకముగా తాను లేనిదానిని సృష్టించినట్లుగా భ్రమించుటము అజ్ఞానము. భూమిలో అట్టడుగున జలమున్నది. కానీ వున్న జలమును యీ వైజ్ఞానికుడు సాంకేతిక విజ్ఞానముతో పైకి తెప్పిస్తున్నాడు. కానీ పూర్వము వున్నదే గానీ నీరు ప్రత్యేకముగా, నూతనముగా సృష్టించలేడు. లేక వున్న మూలధాతువును తాను సంహారము చేయలేడు. ఈ నిర్మూలనము గావించటముగానీ, నిర్మాణము గావించటముగానీ మానవుని చేతిలో లేదు. ఈ యొక్క దివ్యతత్త్వాన్ని ప్రతివ్యక్తి కూడను గుర్తించినప్పుడే యీ దైవత్వమనేది సర్వత్ర వ్యాపించినదనే సత్యాన్ని అర్థము చేసుకోగలము. Matter can never be created nor can be destroyed. మానవుని చేత యిది కేవలము సృష్టించటమో లేక సంహరించటమో జరుగుచున్నదని మనము భావిస్తున్నాము. ఇవి కేవలము మానవుని యొక్క వూహలు మాత్రమే.

ఇట్టి దివ్యత్వమనేది అనాదినుండి కూడను మనకు అగోచరముగానే వుంటున్నది. భూమికి ఆకర్షణా శక్తి సహజమైనది. కానీ న్యూటన్ పరిశోధనల చేత దీనిని ప్రకటితము గావిస్తూ వచ్చాడు. ఈ ఆకర్షణా శక్తి న్యూటన్ ప్రకటన చేయక పూర్వము కూడను యీ భూమి యందున్నది. అదే విధముగనే దైవశక్తి సుప్తముగా, గోప్యముగా సర్వత్రా వుండినప్పటికిని వారివారి సాధనా సంపత్తి ద్వారా సాక్షాత్కరింప చేసుకో కలుగుచున్నారు. మానవుని యందు అనేక తెగలుగా, అనేక మతములుగా, అనేక కులములుగా, అనేక వర్ణములుగా వుండినట్లుగా మనము భావిస్తున్నాము. ఇవన్నియు కూడను మానవుని యొక్క భ్రమతే. ఈ విధమైన భ్రమలు మానవుని యందు వుండినంతవరకు కూడను బ్రహ్మను తాను దర్శించలేడు. సత్యము ఒక్కటే. కాని యిది బ్రాహ్మణుల సత్యము, క్షత్రియుల సత్యము భారతీయుల సత్యము, అమెరికావారి సత్యము, రష్యావారి సత్యము అని యీ సత్యమును

T11108603

ఒక దేశమునకు, ఒక కాలమునకు, ఒక తెగకు, ఒక కులమునకు యిది యేమాత్రము పరిమితము చేయలేరు కదా! అదేవిధముగనే నిప్పు, నీరు యొక్క తత్త్వములు కూడను యిది బ్రాహ్మణుల నిప్పు, యిది శూద్రుల నిప్పు, యిది క్షత్రియుల నిప్పు, యిది భారతీయుల నిప్పు, యిది విదేశీయుల నిప్పు అని దీనికి ఎట్టి భేదములు లేవు కదా! గంగది ఏ కులము? గాలిది ఏ కులము? అందరు అనుభవిస్తున్నాము కదా. ఇదే విధముగనే దైవత్వమనేది ఏకత్వమై వుండినప్పటికి మన యొక్క భ్రాంతులచేత భిన్నత్వముగా విభజించి దానిని భ్రాంతితోనే అనుభవిస్తున్నాము. ఇది కేవలము దైవత్వాన్ని దేశ మత కాలమునకు ఏమాత్రము మనము పోల్చుకొనరాదు.

కృష్ణుని విషయము చూడండి. కృష్ణుడు యే తెగకు చెందినవాడు. ఇది బ్రాహ్మణులకు కులదేవత కాదు. క్షత్రియులకు ఒక సంపద కాదు. వైశ్యులకు యిది ఒక ఐశ్వర్యము కాదు. ఇది లోక సంరక్షణకై అవతరించిన స్వరూపము. కృష్ణుడు నీవాడు, నావాడు అని అనుకోటం కేవలము ఒక విధమైన మమకారమే, అభిమానమే. కృష్ణుడు కేవలము మావాడు అని అనుకోటం చేతనే యాదవుల లోపల ముసలము పుట్టి యాదవులందరు కూడను క్షీణించి పోయారు. కనుక దైవము అందరివాడు. ఏ ఒక్కరివాడు మాత్రము కాదు. ఉన్నది ఒక్కటే. ఒక్కడే దైవము. ఈ ఒక్కడైన దైవము పెక్కు రూపములు పొంది అనేక విధములైన భ్రాంతులను సంతృప్తి పరుస్తూ వస్తున్నాడు. ఇలాంటి దైవత్వమును మనము అర్థము చేసుకొన వలెనంటె కేవలము సాధన మాత్రమే కాదు; విచారణ కూడను అత్యావసరము.

ఈనాడు భిన్నత్వమును ప్రోత్సహించేవారు, అభివృద్ధి పరచేవారు అధికమై పోతున్నారు. ఏకత్వమును అనేకత్వముగా భావిస్తూ వస్తున్నారు. కనుకనే దివ్యత్వమనేది మరింత అడుగునపడిపోతున్నది. లౌకిక సంబంధమైన వ్యామోహముల చేతను, వ్యాపారముల చేతను యీ దైవత్వమును వేరు వేరుగా విభజిస్తూ వస్తున్నారు. దీనివలననే దైవత్వము యొక్క నిజతత్త్వాన్ని మానవులు గుర్తించలేక పోతున్నారు. తద్వారా ధర్మమేమిటో అధర్మమేమిటో గుర్తించుకోలేక పోతున్నారు. ఏ దేశమున ధర్మదేవత, శాంతి దేవత కళకళలాడుతుందో ఆ దేశమునందే సంపత్తి కిలకిలలాడుతుంది. ఈనాడు ధర్మమునకు విరుద్ధముగా, నీతికి విరుద్ధముగా జాతిని ఆధారము చేసుకొని దేశమునందు అనేక విధములైన అశాంతిని అభివృద్ధి పరుస్తున్నారు. ఇలాంటి అధర్మము అభివృద్ధి పరచే వ్యక్తులను అనేకమంది పెద్దలైనవారు చూస్తున్నారు. జ్ఞానులు, పండితులు కూడను దీనిని పరికిస్తూ వున్నారు. గొప్ప గొప్ప ఉన్నత స్థాయి యందున్న అధికారులు కూడను దీనిని చూస్తూ వున్నారు. కాని ఎవ్వరు కూడను దీనిని అరికట్టలేక పోతున్నారు. ఇది అధర్మమని ఎదుర్కొనలేక పోతున్నా

7111O8604

రు. కనుకనే వీరి జ్ఞానము, వీరి స్థానము, వీరిబుద్ధి కుశలత కూడను కేవలము నిర్మూలమై నట్లుగా చూస్తున్నారు. ఇట్టివారు అధర్మము ఆచరించక పోయిననూ అధర్మమును ప్రోత్సహించే వారుగా తోస్తూ వున్నారు. దీనికాక చిన్న ఉదాహరణము.

మహాభారతమునందు యీ యుద్ధమనేది ప్రపంచమునకే చాలా ప్రమాదము కలిగించే దని గుర్తించి ధర్మజుడు కృష్ణుని రాయబారిగా పంపించాడు. నిండుసభలోపల కృష్ణుడు ప్రవేశించి దీని వలన జరిగే ప్రమాదములు, యీ యొక్క పరిస్థితులు చక్కగా వర్ణిస్తూ వచ్చాడు. కానీ యీ విషయములను, మహాజ్ఞానులైన భీష్ముడు, ద్రోణుడు కృపాచారి, అశ్వత్థామ యిలాంటి పండితోత్తములు కూడను చక్కగా వింటున్నారు. కానీ వీరు విని కూడను యే విధమైన వుపయోగము లేక పోయింది. దుష్టులు, దుర్మార్గులు అయిన కౌరవుల యొక్క చెంత చేరటం చేతనే, వారిసహవాసము చేతనే వీరు కూడను దానిని ప్రోత్సహించే వ్యక్తులుగా తయారయ్యారు. ఈ అధర్మమును, అక్రమమును గుర్తించిన విదురుడు దానిని యెదుర్కొనుటకు ప్రయత్నించాడు. ఇది మంచిది కాదని కృష్ణపరమాత్మ యొక్క పవిత్రమైన సూత్రలను మనము ఆచరణయందుంచి దీనికి తగిన పరిహారము గావించవలెనని అనేక విధములుగా నచ్చచెప్పాడు. కానీ ప్రయోజనము లేక పోయింది. ఈ దుష్టులు, దుర్మార్గులు అయినవారి చెంత వుండటం కంటె యెద్దైనా యాత్ర పోవటం మంచిదని విదురుడు ఆరాజ్యమునే విసర్జించి పోయాడు. ఈ భీష్ముడు, ద్రోణాచారి, కృపాచారి వీరందరు కూడను కౌరవుల వుప్పు పులుసు తినటం చేత వారికి ఏదో ఒక విధమైన సహాయకారులుగా వుండాలని వారి రాజ్యములో మేము జీవించినామనే అభిమాన మమకారముల చేత యీ దుష్టులైన వారి రాజ్యమునందే జీవిస్తూ వచ్చారు. అందరు గొప్ప ఆచార్యులే. అందరు ధర్మాధర్మ విషయము గుర్తించిన వారే. నిత్యానిత్య విషయములను పరిశీలించిన వారే. ఆచరణలో లేని యీ జ్ఞానము లన్నియు నిరుపయోగములై పోయినాయి. కనుకనే కట్టకడపటికి యుద్ధములో కౌరవులు ఏ విధముగా మరణించిరో అదే విధముగనే యీ ఆచార్యులు కూడను మరణించారు. అన్యాయమును, అక్రమమును ధిక్కరించి దానిని సరిచేసే శక్తి సామర్థ్యము వుండికూడను దానిని ఎవరు సరిచేయుటకు ప్రయత్నించరో వారు కూడను దుష్టులతో సమానమే. అని భావిస్తూ వచ్చాడు కృష్ణుడు. మన కంటి ఎదుట యింతటి అన్యాయములు, అక్రమములు, అనాచారములు జరుగుచున్నప్పటికిని మనము చూస్తూ, కేవలము దానిని ఏమాత్రము ఎదుర్కొనలేక, దానిని సరిదిద్ద లేకపోయిన వ్యక్తులు కూడను ఆ దుర్మార్గము తో కూడిన వ్యక్తులుగానే తయారౌతారు. కనుకనే దుర్మార్గుల యొక్క ఫలితాన్ని వీరు కూడను అనుభవించ వలసి వస్తుంది.

711108605

లౌకికముగా మన నిత్యజీవితములో అనుభవించే కొన్ని ఉదాహరణములు. రాత్రి వేళలయందు మనలను యేదో ఒకటో రెండో దోమలు కుడతాయి. నల్లులు కరుస్తాయి. కానీ యీ బాధను సహించుకోలేక మనము విషసంబంధమైన స్ప్రే చేస్తాము. కానీ కుట్టినది కొన్ని దోమలే అయితే చచ్చేవి అన్ని దోమలు. కరచినది ఏ ఒకటో రెండు నల్లులైతే దాని సమీపములో వుండిన అనేక నల్లులు కూడను చచ్చిపోతాయి. కానీ కరచిన దానినే చంపుతున్నామా, కుట్టిన దానినే చంపుతున్నామా? అదే విధముగనే దుష్టులు దుర్మార్గులు యొక్క చెంత మనము మన జీవితాన్ని గడుపటము చేత, ఆయొక్క దుష్టసంబంధమైన దానిని అరికట్టలేకపోవుట చేతను మనకు కూడను ఆప్రమాదములో ఒక భాగము వుంటున్నది. దైవము కూడను అన్యాయ, అక్రమ, అనాచారములు జరుగుచున్న సమయములందు దానిని ఆదరించి, దానిని అరికట్టలేని వ్యక్తులను, దానిని ఎదుర్కోలేని వ్యక్తులను కూడను సమముగా దుష్టసంహారము చేస్తూ వస్తాడు. వీడు పండితుడే, వీడు పామరుడే అనికానీ, వీరు జ్ఞాని, అజ్ఞాని అనిగానీ యేమాత్రము కూడను చూడడు. జ్ఞాని అయితే దీనిని ఎందుకు ఎదుర్కొనలేకపోతివి, ఎందుకు నీకు తెలిసిన సత్యాన్ని వానికి బోధించలేకపోతివి. ఆయొక్క దోషమే నీలో కూడా వుంటున్నది. దోషికి సరైన బోధన చేయని దోషమే నీదోషము. కనుకనే సమాజములో జరుగుచున్న అన్యాయ అక్రమ అనాచారములనంతను సాధ్యమైనంత వరకును మనము దానిని ఎదుర్కొని దానిని సరిచేసే విషయములో మనము పాల్గొన్నప్పుడే నిజముగా ధర్మసంస్థాపనకు కొంత తోడ్పడినవారమవుతాము.

త్రేతాయుగమునందు కూడను రావణుడు చేయుచున్న అన్యాయ అక్రమ అనాచారములు చూస్తున్న విభీషణుడు సహించుకోలేకపోయాడు. అనేక విధములుగా తాను అడ్డుతగిలి తన సోదరునికి చాలా విధములుగా బోధిస్తూ వచ్చాడు. కాని మితిమీరిపోయినప్పటికి యీ విభీషణుడు యింక ఆస్థానమునందే వుండుటకు యిష్టపడక ధర్మమూర్తియైన రాముని పాదములు పట్టాడు. కాని దోషములు గావించినవాడు రావణుడొక్కడే. ఈ దోషియైన రావణునికి అనేక విధములైన ఉత్సాహప్రోత్సాహములు యిచ్చిన రాక్షసులు యీ యుద్ధములో మరణించవలసి వచ్చింది. తాను చేసిన దోషములంతా కూడను మెచ్చుకుంటూ వచ్చారు యీ రాక్షసులు. మెచ్చుకొన్న యీ రాక్షసులు శిక్షను పుచ్చుకొనక తప్పలేదు. మన బంధువులుగానీ, మన పుత్రులుగానీ, మనయొక్క సన్నిహితసంబంధులుగానీ దోషమును ఆచరించినప్పుడు ఆదోషమునకు సరైన శిక్షనిస్తూ, దానిని ఎదుర్కొంటూ ఆదోషమును సరిదిద్దుటకు మనము ప్రయత్నించినప్పుడే మనము దోషరహితులౌదుముగానీ, దోషమును ప్రోత్సహించుకుంటూ, దోషమును సవరించుకుంటూ వచ్చినవాడూ వీడూ కూడను దోషియే. కనుక మనము దోషరహితులు

గా వుండవలెనన్న దోషమును చూచిన, దోషములు వినిన, దోషములు అనుభవించే స్థానములో వుండిన దానిని సరైన రీతిలో ఎదుర్కొని ఆ దోష పరిహారార్థనిమిత్తమై కొంత ప్రయత్నము చేయాలి.

కాని పూర్వకాలమందు దుర్యోధనుడు దుర్యోధనుడుగా, శకుని శకునిగా, ధర్మజుడు ధర్మజునిగా ప్రకటిస్తూ వుండేవారు. కాని యీనాడు ధర్మజుడు దుర్యోధనునిగా ప్రకటన చేస్తున్నాడు. పేరు ధర్మరాజు. వాని యొక్క వినయ విధేయతలు చూస్తే చాలా ధర్మిగా కనుపిస్తాయి. మనో భావముల ప్రవర్తన చూస్తే శకునిగా గోచరిస్తాయి. అందరూ భక్తులుగానే కనుపిస్తారు. దుష్ట రక్తములో కూడిన వ్యక్తులేగాని భక్తులు కాదనేది స్పష్టముగా వారియొక్క నడవడికలలో కనుపిస్తుంటాయి. నిజముగా భక్తులైతే భక్తులు చేయవలసిన పనులు చేస్తున్నారా? పేరుకు భక్తులే. తెలుగులో ఒక సామెత వున్నది. మా బజారంతా బ్రాహ్మణులైతే కోడిపెట్ట కనుపించటం లేదన్నారుట. బజారంతా బ్రాహ్మణులైతే కోడిపెట్ట ఎక్కడికిపోతుంది. నిజముగా భక్తులే కనుక అయితే అక్కడ యీ విధమైన అశాంతికిగానీ, దుర్మార్గమునకుగానీ, దూషణకుగానీ అవకాశము ఏర్పడుతుందా? కనుక మనము భక్తులమని అనుకున్నప్పుడు భక్త ప్రవర్తనలంతా మనము నిరూపించాలి. అప్పుడే సర్వత్ర వుండిన దైవత్వము మనకు వ్యక్తమవుతుంది. ఎటు చూచినప్పటికిని ఏకత్వమే దృక్పథమై వుండాలి. ఏ ప్రదేశమునందైన తన విశ్వాసము విశ్వాసముగానే ప్రకటితము గావాలి. కాని యీనాటి భక్తి తత్త్వములు విరుద్ధముగా మారుతున్నవి. కనుకనే దైవత్వమును అర్థము చేసుకోలేని మూర్ఖులుగా తయారౌతున్నారు. దీనికి కారణము స్వార్థము స్వప్రయోజనమే. దురాశ, మమకారములే దీనికి మూలకారణములు. మానవుని యందు దుష్ట బుద్ధులు ప్రవేశించినప్పుడు ఎట్టి మార్పులైనను కూడ చేసుకోటానికి వీలవుతుంది. ఎంత క్రూరులుగా తయారు కావటానికి సిద్ధమవుతున్నారు. ఇది కాదు మానవత్వము. యొక్క విశిష్టత. దివ్యత్వము యొక్క పవిత్రతను మనము చవి చూడటానికి తగిన కృషి చేయాలి. ఇలాంటి తత్త్వము నందు మన ప్రాపంచిక సంబంధమైన దివ్యత్వాన్ని కూడను ప్రకటింపజేయాలి.

ఏకకాలమందు అనేక విధములైన వ్యక్తిత్వములు ప్రకటితమైనప్పుడు దీనిని భౌతికవాదులు అంగీకరించరు. భౌతిక వాదుల యొక్క విశ్వాసము కొంత హద్దులో వుండినది. ఒక్కొక్కరి విశ్వాసము ఒక్కొక్క పరిధిలో వుంటుంటాది; పరిమితిలో వుంటుంది. ఒక రసాయన శాస్త్రజ్ఞుడే వున్నాడు. తన యొక్క సబ్జెక్టులోపల వుత్తీర్ణుడు. చాలా గొప్ప వ్యక్తి. గొప్ప పరిశీలన చేసిన అనుభవజ్ఞుడు. కాని రసాయన శాస్త్రజ్ఞులకు పదార్థ విజ్ఞాన శాస్త్రము అంతగా తెలియదు. అంత మాత్రము చేత పదార్థ విజ్ఞానమును విమర్శించటానికి వీలవుతుందా?

ఒక M.B.B.S చదివిన డాక్టరుకు యింజనీరు విషయము లోపల తనకే మాత్రము అర్థము కాక పోవచ్చు. తన తెలివితేటలు తనయొక్క విద్యయందు మాత్రమే అభివృద్ధి గావించుకోవచ్చు. మరొక విషయమునందు తనయొక్క తెలివితేటలు యేమాత్రము కూడను పనికిరావు. అదే విధముగనే భౌతిక శాస్త్రజ్ఞుని యొక్క విశ్వాసము యొక్క పరిమితి ఆధ్యాత్మిక విశ్వాసముతో పోల్చుకొనుటకు వీలుకాదు. అది చాలా అల్పమైన స్థితి. అలాంటి వారికి అధికమైన తత్వాన్ని గుర్తించుకోటము సాధ్యమవుతుందా? ఒక చిన్న ఉదాహరణము. ఇది ఆధునిక యుగము. సాంకేతిక విజ్ఞానము విలసిల్లిన కాలము. ఈ సమయమునందు మనము కొన్ని కొన్ని ఉదాహరణాలు తీసుకుంటే దీనిని విశ్వసిస్తున్నాము. ఢిల్లీ లోపల ఆకాశవాణిలో ఒక వ్యక్తి తన మాటలు పాటలు ప్రసరించుచున్నాడు. ఢిల్లీలో యీ వ్యక్తి పాటపాడుతూ వుంటే కొన్ని లక్షల మంది తమ తమ యిండ్లయందు కూర్చొని రేడియో ద్వారా దీనిని వింటున్నారు. ఢిల్లీలో పాట పాడే విషయము లోపల ఆ శృతి, లయ రాగ తాళ బద్ధమైన రీతిగా మనయింటిలో మనము వింటున్నాము. ఏ మార్పు కూడను లేదు. అదే విధముగనే ఢిల్లీలో టెలివిజన్ లోపల ఎవరో వ్యక్తి మాట్లాడుతున్నాడు. ఆ వ్యక్తి మనకు దూరములో వుండినప్పటికిని మనయింటిలో మన T.V లో చూస్తున్నాము. మనవలనే అనేక కోట్ల మంది కూడా చూస్తున్నారు. ఢిల్లీలో పాట పాడే పాటలు, ఢిల్లీలో మాటలాడే వ్యక్తిని మన యింటిలో వలెనే అందరి యిండ్లలో కూడను వినగలుగుతున్నారు, చూడగలుగుతున్నారు. ఏక కాలములో భిన్న భిన్న ప్రదేశములందు అదే వ్యక్తి అదే మాటలు యేరీతిగా వినగలుగుతున్నారు. ఏ రీతిగా చూడగలుగుతున్నారు. అని ప్రశ్నిస్తే దీనికి పైజ్ఞానిక శాస్త్రంగా అనేక విధములైన సమాధానములు ప్రారంభమవుతున్నాయి. అదియే ఆనాటి గోపాలకృష్ణుడు పదహారువేల గోపికల యిండ్లయందు ఒకే పర్యాయము దర్శన మిచ్చాడు. ఒకే పర్యాయము అతనిని చూడగలిగినామని చెబితే దీనికి అనేక విధమైన ప్రశ్నలు. ఇది ఎట్లా జరుగుతుంది. ఇది సాధ్యమా అని కొన్ని విధములైన విమర్శలు.

ఈనాడు యీ మంత్రశక్తికి యే విధమైన శక్తిలేదని వీరు విశ్వసించేవారు యంత్రశక్తికి యేరీతిగా కలిగింది? ఒక యంత్రశక్తి యందే యింత పవర్ వుండినప్పుడు యీ మంత్రశక్తిలో ఎందుకుండకూడదు. ఇంతియే కాక దీనికి అంతరార్థమును గుర్తించుకొనలేని మూర్ఖులుగా దీనిని విమర్శిస్తుంటారు. ఆ ఆకాశవాణిలో వుండిన శబ్ద తరంగములు యే విధముగా మనకు యిక్కడకు వస్తున్నాయి. ఈ శబ్ద తరంగములన్నియూ విద్యుత్ శక్తి తరంగములతో లీనమై యీ విద్యుత్ శక్తి తరంగములన్నియు కూడను అనిత్యములైనవి నిత్యముగా మారి, అశాశ్వతములైన యీ తరంగములంతా శాశ్వతమైన రూపము ధరించి సర్వత్ర అగలు అనేదాంట్లో సంచారము జరుపుతూనే వుంటాయి. ఈనాడు మనము రేడియోను గుర్తించిన తరువాత

ఢిల్లీలో వుండిన పాటలు మనము ప్రశాంతి నిలయములో వింటున్నామని యీనాడు చెప్పగలుగుతున్నామే గానీ యివి ఆనాడు కూడను యీ విద్యుత్ శక్తి తరంగముల లోపల యీశబ్దతరంగములు లీనమై వుంటున్నాయి. జీనికాక జీవితము వుండనక్కరలేదు. జీవితతదుపరి కూడను జీనిని మనము అనుభవించటానికి వీలవుతుంది. ఎట్లనగా దీనికి మరొక ఉదాహరణము. ఘంటసాల శ్రావ్యముగా పాడే వాడు. కానీ అతడు మరణించి భస్మీభూతమయ్యాడు. కానీ యీనాటికి కూడను అతని యొక్క స్వరములు మనము స్వచ్ఛముగా వినగలుగుతున్నాము. ఏ మద్రాసు రేడియోలో అతని పాటల టేపురికార్డు వేస్తే దానిని మనము యిక్కడ కూడ వినగలుగుతున్నాము. దీనికి కారణమేమిటి? ఈ శబ్దతరంగములు విద్యుత్ తరంగములతో కూడి వుంటున్నాయి. ఈ తరంగములు యేనాటికైనా కూడను, ఎన్నియుగములకైనా నిలచిపోతుంటాయి. వేరుకనిపెట్టక పూర్వము కూడను యీ తరంగము లుంటున్నాయి. అన్ని తరంగములు కూడను సర్వత్ర వ్యాపించి వుంటున్నాయి. అన్ని శబ్దములు కూడను సర్వత్ర వ్యాపించి వుంటున్నాయి. అయితే ఎవరి చిత్తము పరిశుద్ధముగా వుంటుందో అక్కడ మాత్రమే యీ తరంగములు వినబడుతుంటాయి. కనిపిస్తుంటాయి. ఈ ఢిల్లీలో పాడే పాటలు రేడియో లేని యింటిలో వినిపిస్తున్నాయా? పోనీ రేడియో వున్నయింటిలో కూడను ఢిల్లీ పాడుతున్న స్టేషను వేయకుండా మద్రాసు స్టేషను వేస్తే వినబడుతుందా? కనుక ఏ స్టేషనులో పాడుతున్నాడో ఆ స్టేషను అసలైన ట్యూన్‌లో పెట్టినప్పుడే మనము వినగలుగుతున్నాము. అదే విధముగనే సర్వత్ర వ్యాపించిన దైవత్వాన్ని మన చిత్తము అనే రేడియో యందు ఏకాగ్రత అనే స్విచ్ వేసి దివ్యత్వమనే ఆనందములో మనము మునిగినప్పుడు ఆ దివ్యతత్వమనేది మనకు అర్థమవుతుంది.

కనుక మన శబ్దతరంగములు ఒక్కటైనా కూడను వ్యర్థము కావటము లేదు. ఈ శబ్దతరంగములు సర్వత్ర నిండి వుంటున్నవి. దానిని మనము జ్యోతి తరంగములుగా మార్చుకోవాలి. అదియే ధ్యానశక్తి. అదియే యోగశక్తి. ఇట్టి శక్తిని వారు అనుభవించి ఆనందించటం చేతనే గోపికలకు యీ విధమైన దర్శనము ప్రాప్తించింది. వారి చిత్తములు యెప్పుడును భగవంతుని యొక్క రూపముతోనో, నామముతోనో హత్తుకొనిపోయి వున్నాయి. కనుక యీ విధమైన భక్తి తరంగములకు యేమాత్రము Reason అనేది వెదకటానికి అధికారము లేదు. ఇలాంటి అనుభూతులు beyond reason. అన్నింటికిని ప్రత్యక్ష ప్రమాణములు వీలుకాదు. ప్రాపంచిక సంబంధమైన చిన్న చిన్న విషయములకే ప్రత్యక్ష ప్రమాణములు యేమాత్రము పనిచేయలేనప్పుడు దివ్యత్వమైన, ఆత్మతత్వమైన భగవత్ తత్వానికి యేరీతిగా ప్రమాణమును సరికావలసి వస్తాయి. ఇది కేవలము అజ్ఞానము యొక్క తత్వము. కనుక యీ ఆధ్యాత్మిక తత్వమును అర్థము చేసుకున్నవాడు యీ విధమైన వ్యర్థమైన

మార్గములో ప్రవేశించడు. ఎవరెవరి భక్తి భావములు వారికే తెలుసు. ఎవరెవరి భక్తిప్రపత్తులు వారికే అర్థమవుతాయి. ఒకరి భక్తిప్రపత్తులు ఇంకొకరు అర్థము చేసుకోటం చాలా కష్టము

భగవదనుగ్రహము సర్వత్ర నిండుగా దండిగా వుంటూనే వున్నది. కానీ దానికి సూటిగా మన హృదయాన్ని త్రిప్పుటం లేదు. ఆ పవిత్రమైన దివ్యత్వమును మన హృదయములో నిండుగా నింపుకోలేదు. కనుకనే మనకు అడుగు అడుగునా అనుమానములే. క్షణ క్షణము మనకు సందేహములే. తనను తానే నమ్మలేకపోతున్నాడు మానవుడు. నాలుగు నిముషములు నరుని నమ్మలేని మానవుడు నారాయణుని నమ్మగలడా? కనుక మన నమ్మకములో వుండిన దోషము లేగానీ దైవములో యెట్టివిధమైన మార్పులుగాని కూర్పులుగాని రావు లేవు. విశ్వాసము, దృఢమైన విశ్వాసము కల్గివుండాలి. క్షణ క్షణము మనకు వచనము మార్పుచెందరాదు. ఇలాంటి చిత్త శుద్ధి లేని వానికి యెంతకాలము తిరిగినప్పటికిని, ఎన్నివిధములైన సాధనలు చేసినప్పటికిని దైవానుగ్రహమును యేమాత్రము అందుకొనలేడు.

భగవంతుడు హృదయాన్ని మాత్రమే పరిశీలన చేస్తాడుగానీ నీయొక్క పూజలు పునస్కారములుగానీ చూడడు. ఏ పూజలు చేయక పోయినప్పటికి, ఏ ధ్యానములు చేయక పోయినప్పటికి, నీ చిత్త శుద్ధిని నీవు సరైన రీతిలో వుంచుకున్నప్పుడే దైవము అందులో ప్రవేశిస్తాడు. నిన్నటి దినము మన విద్యార్థి చెప్పినట్లుగా మొట్టమొదట నీవు నావాడు రెండవది నీవు నావాడైతే నేను అహంకారిగా మారగలను. నేను నీవాడు. గోపికలు మేము మీవారమని ప్రార్థించారు. యాదవులు కృష్ణుడు మావాడు అని విశ్వసించారు. యీ మావాడు అనే విశ్వాసము చేతనే అహంకారము పెరిగిపోయింది. అహంకారము యెక్కడ వుండునో వాడు అధఃపతనమై పోతాడు. కనుకనే యాదవకులములో ముసలము పుట్టింది. ఎంతకాలమైనప్పటికిని స్వామి మేము మీవారమని ప్రార్థించిన గోపికలు ఎప్పటికిని క్షేమసంతోషములు అనుభవించారు. కనుకనే పిల్లలకంతా కూడను నేను మూడు ముచ్చటైన మాటలతో చెప్పాను మొన్న. నాముందు నీవు నడచుటానికి ప్రయత్నము చేయవద్దు. Don't walk infront of me. I may not follow. Do not walk behind me, I may not lead. Walk beside me and be my friend. నాముందు నీవు నడచుటానికి ప్రయత్నము చేస్తివా నీవు నాకు కూడను తప్పు మార్గము చూపవచ్చు. మార్గము నీకు తెలియదు. పోనీ నావెనకాల ఏమైనా నన్ను అనుసరించుటానికి ప్రయత్నము చేస్తివా అంటే నను తప్పించుకొని నీవు వెళ్ళవచ్చు. నా ప్రక్కనే రా. తప్పించుకొనుటకుగానీ, ముందు నీవు తప్పు మార్గము పోవుటకుగానీ అవకాశము వుండదు. because I am with you. నేను నీవెంటనే వున్నాను. అనగా దానియొక్క అంతరార్థము యేమిటి? నీవు నేను ఒక్కటిగానే వున్నాము. అనగా దైవత్వము సర్వత్రా వుంటున్నాడు. ప్రతి శరీరమునందు కూడను శరీరియై వుంటున్నాడు. ప్రతి దేహమునందు దేహియై

వున్నాడు. అలాంటి సమయములో నేను ముందు పోవుటకుగానీ, వెనుక పోవుటకుగానీ వీలుకాదు. కనుకనే దైవత్వమును నీతో కూర్చుకొని రావాలి. దైవాన్ని నీతో చేర్చుకొని రావాలి. ఇదే నిజమైన సాధకుని యొక్క లక్షణము.

ఎక్కడ వుండినాగానీ స్వామిసేవ మేము చేసుకుంటాము అని అనుకోవచ్చును. కానీ అంత విశాల హృదయము తనలో లేదు కదా. ఇది కేవలము స్వార్థపరుని యొక్క మూర్ఖత్వము. ఇలాంటి పరిస్థితి యందు తాను అనేక విధములైన దోషములను కల్పించుకొని దీనితో తన జీవితాన్ని వ్యర్థము చేసుకుంటాడు. అంత పరిపూర్ణమైన విశ్వాసము వుండిన వానికి ఏవిధమైన వాంఛలు వుండవు. కాని అట్టి స్థితి లభించేంతవరకు మనకు అనుసరించక తప్పదు. కృష్ణుడు, రాముడు కూడను గురువుల దగ్గర అనేక విద్యలు అభ్యసించి వారిని ఆనందపరచే దింట్లో వారు ప్రయత్న పూర్వకముగా సాధించారు. కనుకనే గురుతత్వాన్ని వారు శిష్యులకు బోధిస్తూ వచ్చారు. తాను అనుభవించి ఆనందించి పదిమందికి పంచాలి. ఈ దుష్టవాంఛలు అధికము కావటం చేతను, లౌకికమైన జీవితము పెంచుకోటం చేతను ప్రపంచమే సత్యమని విశ్వసించటము చేతను యావిధమైన దుష్టబుద్ధులు పెడమార్గమును పడుతూ వుంటాయి.

ఎన్నివిద్యలు నేర్చి యేమి ఫలము
తన్నొసట వ్రాత తప్పింపనెవరి తరము
చెడ్డబుద్ధులు తన తల చేరెనేని
ఎండ బారును బుద్ధులు బండబారు.

ఇలాంటి బుద్ధులకు దైవత్వము యేరీతిగా అర్థమవుతుంది. ఇలాంటి మూర్ఖులను మనము చెంత చేర్చుకొని వారితో పాటు మనము అనుసరిస్తున్నాము. వారికి తగిన బుద్ధిని చెప్పి, వారిని తగిన మార్గములో ప్రవేశపెట్టటానికి ప్రయత్నించక పోవటమే మీ దోషము. కనుకనే ఆ దోషములు నీకు కూడను దోషములుగా ఏర్పడుతాయి.

కనుక సమాజములో ప్రవేశించి, జరుగుచున్న దోషములను, జరుగుచున్న అన్యాయములను, అక్రమములను, అనాచారములను సాధ్యమైనంత వరకు ఎదుర్కొని దానిని సరిచేయటానికి తగిన కృషి చెయ్యాలి. ఇట్టి అర్హత వుండిన వాడే సమాజసేవకు అధికారి. కనుక యిట్టి అధికారమును మనము సంపాదించాలి. ఎట్టి ప్రమాదములు వచ్చినప్పటికిని మనము భయపడనక్కర లేదు. ఎట్టి నిందలు మనకు వచ్చినప్పటికిని మనము వెరవనక్కర లేదు. నిందలు, నిష్ఠురములు జగత్తుకు మాత్రమే. నీకు కాదు. నీవు నిత్యుడు, సత్యుడు. అలాంటివాడు నిందలు నిష్ఠురములకు భయపడనక్కర లేదు. దైవ విశ్వాసమును దృఢము చేసుకొని ఆ విశ్వాసమును మనము ఆచరణలో వుంచి, ఆనందాన్ని అనుభవించినప్పుడు, పెద్ద

7111108611

ఏనుగులంత బలము కూడను నీకు లభిస్తుంది. ధైర్యం సర్వసాధకం

నిన్న చెప్పాను. మన శీలత్రయములివి. పవిత్రము, సహనము, ధైర్యము వీటిని మనము సాధించినప్పుడు ఎన్నింటినైనా మనము సాధించవచ్చు. పవిత్రము లేనివానికి యీ విధమైన సహనము లేకుండా పోతుంది. సహనము లేనివానికే ధైర్యము చాలదు. ఈ ధైర్యము లేనప్పుడు వాడు మహాబలహీనుడై పోతాడు. తాను చెడటమే కాకుండా పరిసరప్రాంతములు కూడను చెడకొడతాడు. ఇలాంటి జీవితము మానవజీవితమే కాదు. కనుక మనము బాగుపడి పదిమందిని బాగుచేయటానికి తగిన కృషి చెయ్యాలి. మనము యీ విధమైన మార్గములో యేకత్వమైన దైవత్వాన్ని మనము విశ్వసించి సర్వమును కోల్పోయినా పరవాలేదు దైవాన్ని మాత్రము కోల్పోరాదు. అలాంటి నిత్యమైన, సత్యమైన విశ్వాసమును అభివృద్ధి చేసుకోవాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.